
# నేనూ...నా ఇంటర్‌నెట్

*ప్రియదత్త వీక్లీ.. 11 జూన్, 2003*



"మీరు పంపిన గ్రీటింగ్ రియల్లీ సూపర్బ్! ఐ లైక్ వెరీమచ్! యునో- ఐ లైక్ రోజెస్... మా ఇంట్లో ఆరు కలర్‌రోజ్ ప్లాంట్స్ ఉన్నాయి తెలుసా? ఒన్స్ ఎగైన్ థాంక్స్ ఫర్ సెండింగ్ మీ ఫ్లవర్స్ అండ్ ఫ్రెండ్‌షిప్ గ్రీటింగ్స్! అసలు విషయం- నేనెవరినో కనిపెట్టానన్నారుగా! చెప్పరూ... ప్లీజ్!"

"నువ్వు చాలా మంచి అమ్మాయివి! నీవు చల్లిన మాటల ముత్యాలు కలెక్ట్ చేసుకున్నాను. కానీ, మమతల హారానికి అవి సరిపోవడంలేదు. ఐ నీడ్ సమ్‌మోర్ ముత్యాలు. గులాబీలను ప్రేమించేవారి మనసు, మంచితనం, స్టైల్ అంతా గులాబీలంత అందంగా ఉంటాయంటారు.

అందమైన మనసుకి అభినందనలు! ఒక మంచిమనసుతో అంటున్న మాటలు ఆపార్థానికి దారితీయవని ఆశిస్తాను..."

'సెండ్ ఆప్షన్'కు క్లిక్ చేసింతరువాత ఆనందంతో నిట్టూర్చాడు.

సాత్విక్‌కి ఇది మామూలే..! హరిణితో 'నెట్ ఫ్రెండ్‌షిప్' అతనికి దినచర్యలో ఒక భాగమైపోయింది. నిద్రలేచిన దగ్గరనుండి నిద్రపోయేవరకు ఆమె గురించే ఆలోచిస్తుంటాడు. ఆమె మాటల్ని, ఆ మాటల చాటు ఆమె మనసుని చదివి ఆనందిస్తూంటాడు. ఒకప్పుడు ఎవరో తెలియకపోయినా ఇప్పుడు ఆమె అంటే మదిలో తీయని భావన! మనిషి గురించి తెలియనితనం అజ్ఞాతమైన ఆరాధనని అతనిలో కలుగజేస్తుంటుంది.

"సాతూ! మీతోటి అపూర్వమైన స్నేహమాధుర్యాన్ని చవిచూసిన నేను అమృతధారలతో ఓలలాడి సేదతీరుతున్నాను. అయినా మీ అభిమానులంటే మీకు మరీ అంత అభిమానమా? ఎందుకో... ఈ క్షణం నాకు ఆనందమయంగా ఉంది. మీరు కోరినట్లు కొత్తగా రాస్తున్న మీ కథలో నాయికకి నా పేరు పెట్టుకోడానికి మనస్ఫూర్తిగా నా అంగీకారాన్ని తెలియజేస్తున్నాను. ఐ యామ్ హరిణి, ట్వంటీ త్రీ, బి.కామ్., ప్రెజెంట్లీ వర్కింగ్ యాజ్ కంప్యూటర్ ఆపరేటర్.

మీ గురించి నా ఊహను తెలియజేయడంలో తప్పు లేదనుకుంటాను. ఐ థింక్ యు ఆర్ సిక్స్ ఫీట్, సిల్కీ హెయిర్, స్మైలీ ఫేస్, హాండ్సమ్ అండ్ నైస్ పర్సనాలిటీ!

'స్నేహం, స్నేహితులు' అనే విషయాలపై నాకు నిర్దిష్టమైన అభిప్రాయం ఉంది. నిజమైన స్నేహం అనేది మరో లోకం! ఎన్ని అవాంతరాలు ఎదురైనా దానికి శేషమేగాని ముగింపు ఉండదు. ఇట్ ఈజ్ అబ్సల్యూట్లీ సెల్ఫ్‌లెస్! నిజమైన స్నేహితుడు తనవారికోసం త్యాగానికి కూడా సిద్ధపడుతుంటాడు. ఈ విధమైన అనుబంధం జీవితానికి అనిర్వచనీయమైన సాఫల్యాన్ని కలుగజేస్తుంది. బ్రతుకులోని ఆవేదనల్ని అంతమొందించి సమస్యల్ని సానుకూలంగా పరిష్కరిస్తుంటుంది. ఫ్రెండ్ ఈజ్ మేడ్ ఇన్ ప్రాస్పరిటీ అండ్ ట్రైడ్ ఇన్ యాడ్వర్సిటీ! ఇవి నాలోని భావాలు మాత్రమే! మీరు కూడా మీ ఇతర స్నేహితుల్ని స్నేహంపై మీ అభిప్రాయాల్ని తెలియజేస్తారనుకుంటున్నాను. ఫ్రెండ్‌షిప్ ఈజ్ ఫర్ ఎవర్ అండ్ ఎవర్ అండ్ ఎవర్!

బై టేక్ కేర్ ఫ్రెండ్లీ యువర్స్

హరిణి"

ఇంటర్‌నెట్ మానిటర్ స్క్రీన్ మీద అక్షరాలు పొందికగా కనబడుతూ సాత్విక్‌కి ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నాయి. తనలాగే కాస్తో, కూస్తో భావుకత ఉన్న అమ్మాయి కాబట్టే- తన మనసుని తట్టి తలపుల నీలాకాశంలో చుక్కలా మెరిసి మైమరిపిస్తోంది.

"హాయ్ సాతూ! హౌ ఆర్ యు? ఐ యామ్ ఫైన్! వెరీ థ్యాంక్‌ఫుల్ టు యు బీయింగ్ మై ఫ్రెండ్! హేపీ టు హియర్ దట్ యువర్ స్టోరీస్ ఆర్ సెలెక్టెడ్! ప్లీజ్ థింక్... లవ్‌స్టోరీస్ ఆర్ బెటర్ అండ్ యాక్సెప్టెడ్ బై ఎవిరీ వన్..." హరిణి.

"హనీ... నీ పేరు తేనెకన్నా తీయగా అనిపిస్తోంది. అవును హనీ... హరిణిలో భాగమే కదూ! నీ మెయిల్స్ నాకు ప్రాణాలు. వాటిలో భావాలు నాలోని జీవాలు. నీ మాటలు విన్న నా మనసు మారాం చేస్తుంటుంది నిన్ను చూడాలని! కానీ, నువ్వు ఎక్కడో దివిలో విరిసిన పారిజాతానివి. ఊహలకు అందని ప్రణయ తేజానివి!"

"సాతూజీ... ఆప్ కో క్యాహువా జీ! ఐ డోన్ట్ అండర్‌స్టాండింగ్ యు? ఏదో మెయిల్స్ చేస్తూ సరదాగా పలుకరిస్తున్నాను కదాని ప్రణయ తేజాన్ని చేసేస్తే ఎలా సార్? యు ఆర్ నాట్ గుడ్‌ఫ్రెండ్ ఫర్ మీ! 'ప్రియదత్త' పత్రికలో వచ్చిన మీ 'బాధ్యతా బంధం' కథ చదివాను. మీ కథాంశాలన్నింటికీ గ్రామీణ వాతావరణాన్ని ఎక్కువగా ఎన్నుకుంటుంటారు. వై? ఐ థింక్ యు ఆర్ ఫ్రమ్ విలేజెస్... యామై కరెక్ట్? మీ నా 'హనీ' అన్నపేరు హనీ అంత తీయగా ఉంది."

హరిణితో 'నెట్ ఫ్రెండ్‌షిప్' ఏర్పడిన తరువాత సాత్విక్ ధోరణే మారిపోయింది. అంతకుముందు పెద్దగా బాదరబందీ, టెన్షన్స్ ఏమీ లేకపోయినా- ఎప్పుడూ ఏదో తెలియని నిర్లిప్తత, నైరాశ్యాలతో కొట్టుమిట్టాడుతుండేవాడు. ఇప్పుడు అతనిలో ఆమె మాటలు ఉత్సాహాన్ని నింపి, చైతన్యాన్ని కలుగజేస్తున్నాయి.

ఆమె ఎవరో, ఎక్కడుంటుందో తెలీదు. కానీ- నవ్విస్తుంది, కవ్విస్తుంది, తాను ఓవర్‌గా మాట్లాడితే నిలదీస్తుంది. అంతలోనే 'సారీ...' అంటుంది. మనసుకు నలత చేసిన ప్రతిసారీ- మాటలు రంగరించిన మందుతో ఉపశమనాన్ని కలుగజేస్తుంది.

ఒకసారి సాత్విక్ ఆఫీసులో ఇంటర్‌నెట్ 'సర్వర్ ప్రాబ్లమ్'తో పనిచేయక మొండికేస్తే ఎంతగానో పరితపించింది. ఏమిటో ఆ స్నేహం..!

- వింత అనుభూతికి లోనవుతున్నాడు సాత్విక్.

'స్నేహం' అనేది మనసు అంగీకరించడాన్ని బట్టి ఉంటుంది. ఒకరు మరొకరి పట్ల ఎందుకు ఆకర్షణ చెందుతారనేది వ్యక్తిగత అభిప్రాయమే అయినా- సంవత్సరకాలంగా ఎవరో తెలియని హరిణి- సాత్విక్ ఊహల వనంలో వనదేవతగా కొలువుతీరింది.

'ఆ అమ్మాయి ఎవరో, ఎలా ఉంటుందో! ఈ విషయం తన భార్యకి తెలిస్తే! అసలు అపురూపకి తాను అన్యాయం చేస్తున్నాడా?' ...సాత్విక్ అంతరంగాన్ని ఇంతగా వివరిస్తున్న నేను ఇక్కడ సాత్విక్ అపురూపాల గురించి చెప్పడానికి ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లడం తప్పనిసరి!

● ● ●

"అప్పూ... నా 'కొలువు' కథకి అమెరికా తెలుగు అసోసియేషన్ ఫస్ట్‌ప్రైజ్ ఇచ్చింది!"

ఇంటిమేషన్ లెటర్‌తోపాటు స్వీట్స్ ప్యాకెట్‌తో వచ్చిన భర్తను చూసి, "సంతోషం..!" అంటూ ముక్తసరైన సమాధానం ఇచ్చింది అపురూప.

"ఏ.టి.ఏ. అనేది అమెరికాలో ప్రెస్టీజియస్ సంస్థ! వాళ్ళు నిర్వహించిన తెలుగుకథల పోటీలో ప్రైజ్ రావడం... అదీనూ ఫస్ట్‌ప్రైజ్ రావడం అంత సులువు కాదు. ఈసారి అదృష్టం నీ మొగుడికి దక్కింది. నెక్స్ట్ సండే రవీంద్రభారతిలో ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్! ఈ శుభతరుణంలో నీవు ఏమి కోరుకుంటావో చెప్పు?"

"కోరుకునేదేముంది? ఈ వయసులో అదర్ యాక్టివిటీస్‌కన్నా పిల్లల చదువు చాలా ముఖ్యం! వాళ్ళ గురించి మీరు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఆఫీసు నుండి వచ్చి, వాళ్ళని చదివించడం నాకు కష్టంగా వుంది. రోజూ రెండు మూడు గంటలు మీరు వాళ్ళ దగ్గర కూర్చుంటే బాగుంటుంది."

"వాళ్ళు బాగానే చదువుతున్నారు కదోయ్! అయినా రంజిత్, రంజిత ఇంకా చిన్నపిల్లలు. ఇప్పటినుండే అంత టెన్షన్ పడితే ఎలా చెప్పు?"

"మీకు అలాగే ఉంటుంది. శశికళగారి పిల్లల్ని చూడండి- స్కూలు నుండి వచ్చినప్పటి నుండి పుస్తకాలు ముందేసుకు కూర్చుంటారు. వీళ్ళు మటుకు నా మాట వినడం లేదు. ఆటలు ఎక్కువయిపోయాయి."

"కంగ్రాట్స్ డాడీ... నీ 'కొలువు' కథకు ప్రైజ్ వచ్చినందుకు!"

కొడుకు, కూతురు ఆనందంగా ఆటలు ఆడుకుని వచ్చి చెబుతుంటే- వారి అభినందనల కన్నా అపురూప అన్నమాటలు అతనిలో నిస్సత్తువ ఆవహించేలా చేశాయి.

సాత్విక్‌కి రోజూ ఇది మామూలే! అసలే బోళామనిషి, భార్యతో రోజూ తన హాబీ గురించి, రచనల గురించి, తెలుగుసాహిత్యం గురించి మాట్లాడితే ఆమె తేలిగ్గా తీసిపడేస్తుంటుంది.

అతనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్! 'సిస్టమ్స్ డిజైనింగ్, సర్వీసింగ్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ ఎక్విప్‌మెంట్ ఫీల్డ్'లో స్థిరపడి డబ్బుల్ని రెండుచేతులా సంపాదిస్తున్నాడు. తన వలన పదిమందికి ఉపాధి దొరకడం చాలా గర్వంగా భావిస్తాడు. భార్య అపురూప, ఇద్దరు సంతానం... కొడుకు రంజిత్, కూతురు రంజిత.

సాత్విక్ చిన్నప్పటి నుండి అమ్మానాన్నల అభిప్రాయలకు ఎప్పుడూ విలువ నిచ్చేవాడు కాడు. అటువంటిది- వారి మాటలను గౌరవించి, వాళ్ళు చూసిన 'అపురూప' మెడలో తాళి కట్టి భార్యను చేసుకున్నాడు.

ఆమె విద్యాధికురాలు! విద్యతోపాటు అపురూపకు ఇండివిద్యువాలిటీ ఎక్కువ! దానికితోడు కొంచెం ప్రాక్టికల్ టైప్ లేడీ! భార్యాభర్తలు గానీ, స్నేహితులుగానీ ఒకరిపై ఒకరు కొంతవరకు మాత్రమే డిపెండ్ అవ్వాలనుకునే మనస్తత్వం ఆమెది! తనకు సెల్ఫ్ ఎర్నింగ్ కెపాసిటీ, ఆర్థిక స్వావలంబన ఉంటేనే ఇండివిద్యువాలిటీ మనగలుగుతుందని అనుకుంటుంటుంది.

"ఇంట్లో కూర్చుంటే ఏమీ తోచడం లేదు. వ్యాపకం ఏమీ లేకపోతే పిచ్చి ఎక్కినట్లుగా ఉంటోంది. నేను కూడా టైం పాసింగ్‌కి ఏదైనా ఉద్యోగం చేయాలని ఉబలాటంగా ఉంది" అనేసరికి భార్య మాటలకి ఎదురు చెప్పడం చేతగాని సాత్విక్- "వేరే ఉద్యోగం దేనికి? నేను బిజినెస్ పనుల మీద ఎక్కువగా క్యాంప్స్‌కి వెళ్తుంటాను. మన ఆఫీసు ఎడ్మినిస్ట్రేషన్ నువ్వు చూసుకుంటే... నాకు పని ఒత్తిడిని తగ్గించినదాని వవుతావు."

"చూడండీ... 'ఫలానా సాత్విక్‌గారి భార్య!' అని అందరిచేతా పిలిపించుకోవడం నాకు పెద్దగా ఇష్టం ఉండదు. ఇంట్లోవరకు మాత్రమే మనం భార్యాభర్తలం! బయట ఇతరుల ప్రమేయంలేని ఇండివిద్యువాలిటీ ప్రతిబింబిస్తున్న ఉద్యోగం చేయాలని నా కోరిక!"

స్వతహాగా సున్నిత మనస్కుడు, భావుకుడైన సాత్విక్ నుండి ఆమెకు పెద్దగా ఆటంకం ఎదురవలేదు.

సర్వీస్ కమీషన్ పరీక్ష వ్రాసైన తరువాత అపురూప తన అభిరుచి మేరకు కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం సంపాదించింది. భార్య ఉద్యోగం చేయవలసిన అవసరం తనకు లేకపోయినా, ఆమె అభిప్రాయానికి పెద్దపీట వేశాడు సాత్విక్.

చిన్నప్పటి నుండి చదువుసంధ్యల్లో, ఆటపాటల్లో చురుగ్గా ఉండే అతను- ఆశువుగా మాటలు చెప్పడం, అనర్గళంగా విషయాన్ని విశ్లేషించటం నేర్చుకున్నాడు. కాకతాళీయంగా తాను రాసిన కథలు, కవిత్వాలను ఆదరించి వివిధ పత్రికలు ప్రచురించడంతో- 'రచయిత'గా కొత్త

అవతారం ఎత్తాడు. తన భావాల పట్ల పాఠకుల స్పందన, అభిమానంగా వారు రాసే ఉత్తరాలు అతనికి ఎంతో సంతోషాన్నిచ్చేవి. వృత్తిలో అలసిన ప్రతిసారీ... ప్రవృత్తి ఎంతో ప్రోత్సాహాన్నిచ్చేది. దానితో సాహిత్యంపై అభిలాషను పెంచుకున్న సాత్విక్‌కి కథలు రాయడం హాబీగా మారింది.

చిన్నవాళ్ళయినా రంజిత్, రంజితలు తన ఆర్ట్ గురించి మెచ్చుకోలుగా మాట్లాడుతున్నా- అపురూప వింతధోరణి అతనిని అప్పుడప్పుడు నిరుత్సాహానికి లోనుచేసేది. 'బాగుంది' అని మెచ్చుకోలుగా మాట్లాడితే ఏమయింది?' అని మనసులో అనుకునేవాడు. ఆమె ఎప్పుడూ తన ఆఫీసు పని, ఇంటిపని, పిల్లల చదువులు తప్ప- భర్త అంతరంగం గురించి పెద్దగా పట్టించుకునేది కాదు.

'ఈ మనిషి ఇక ఇంతేలే..!' అని ప్రతీసారి సరిపుచ్చుకునేవాడు. తనకు ఇష్టంలేకపోయినా- ఆమె మనసెరిగి ఉద్యోగం చేయడానికి ఒప్పుకున్నాడు. ఆమె ప్రాక్టికల్ ధోరణిని ఎప్పుడూ కాదనలేదు. కానీ, సున్నితమైన తన భావాల్ని అగౌరవపరుస్తోంది. భార్యాభర్తలన్న తరవాత ఒకరి ఉద్దేశాలను మరొకరు మన్నించుకున్నప్పుడే మనుగడ సులభతరమవుతుంది. అపురూపను తాను అపురూపంగానే ట్రీట్ చేస్తున్నా... ఆమె ఎప్పుడూ మరోలోకంలో ఉంటున్నట్లుగా ఉంటుంది. కలత చెందడం తప్ప ఏమీ అనలేకపోయేవాడు సాత్విక్.

"హలో సార్! హౌ ఆర్ యు? ఐ రీడ్ యువర్ స్టోరీస్ రెగ్యులర్లీ! 'గుండె తలుపు' ఈజ్ ఆల్సో వెరీ నైస్! రైట్... సోమెనీ స్టోరీస్ లైక్ దట్- దిస్ స్టోరీ ఈజ్ క్వయిట్ నేచురల్. ప్లీజ్ గివ్ మి రిప్లయ్ ఫర్ దిస్ ఐ.డి.

బై ఫర్ నవ్, టేక్ కేర్
హరిణి."

మొదటిసారి హరిణి ఇచ్చిన ప్రోత్సాహంతో సాత్విక్‌లో తెలియని ఉత్సాహం చోటు చేసుకుంది. ఆమె అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతూ మెయిల్స్ పంపుతుండేవాడు. అజ్ఞాతంగా ఉండి ఆమె ఇస్తున్న ప్రోత్సాహంతో రచయితగా ఇక వెనుదిరిగి చూడలేదు.

"సార్... మీ నిజాయితీకి జోహార్లు! నేనడగిన డిటెయిల్స్ చెప్పారు. మేడమ్ గురించి, మీ పిల్లల గురించి బాగా చెప్పారు. మీకు మేరేజ్ కాలేదని నాతో అబద్ధం చెబుతారనుకున్నా! మీ భార్య ఉద్యోగం, ఆవిడ మంచితనం అన్నీ బాగానే చెప్పారు. కాని, ఆవిడ ఎప్పుడూ కోపంగా ఉంటుంటారు. అందుకే రేసింగ్‌లో నాకు నెంబర్‌వన్ ర్యాంక్ ఇస్తున్నారు. యామ్ ఐ కరెక్ట్?"

'యాహూ డాట్‌కామ్' ఇన్‌బాక్స్‌లో హరిణి తన మెయిల్స్‌తో స్వాగతం పలుకుతుంటే అదొరకమైన అనుభూతికి లోనవుతుండేవాడు.

• • •

"డియర్... ఇంతకాలం నుండి ఫ్రెండ్‌షిప్ చేస్తున్నావు కదా! నిన్ను బాగా చదివేశాను. నువ్వు కూడా నేనేమిటో ఈపాటికి గ్రహించగలిగి వుండాలి. ఈ సందర్భంలో నా మనసులో మాట చెప్పాలనుకుంటున్నాను. నాలోని భావుకత హృదయానికి సున్నితత్వపు ముసుగును వేసేసింది. మారాం చేస్తున్న మనసు ఎప్పుడూ ఏకాంతాన్ని కోరుకుంటుంది. 'ఆ ఏకాంతవాసం లోని కాంతానివి నువ్వు' అని చెప్పకతప్పదు. అపురూప మంచిఅమ్మాయే అయినా- మా ఇద్దరి మధ్య ఏదో తెలియని సున్నితమైన పొర మమ్మల్ని మానసికంగా ఎడబాటును కలుగజేస్తోంది. బహుశా...

కుటుంబ సమస్యలు... పిల్లల పెంపకం... వాళ్ళ చదువులు... మా ఉద్యోగాలు... అన్నీ కలిసి ఓ విధమైన నైరాశ్యాన్ని కలుగజేస్తున్నాయి. ఉదాసీనత మాలోని ఆనందాన్ని నిర్వీర్యం చేస్తోంది.

ఉదాహరణకు- రోజూ పొద్దుపోయిన తరువాత ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి... పిల్లలు, వాళ్ళ అల్లరి, చదువుకోవడం లేదని ఆమె వాళ్ళను కొట్టడం వంటివి నా మానసిక స్థితిని చిన్నాభిన్నం చేస్తుంటాయి. తద్వారా చాలా అశాంతిని పొందుతుంటాను. ఆఫీసు నుండి వచ్చిన తరువాత అలసిపోయిన అపురూప చికాకులు ప్రదర్శించడం, ఇంటిపనుల్లో మునిగి నన్ను విస్మరించడం నాకు ఆవేదనను కలుగజేస్తుంటుంది. ఆ సమయంలో నేను ఒక మంచిమాట కోసం, చక్కని పొగడ్త కోసం ఎదురుచూస్తుంటాను. అది నాకు వేయి ఏనుగుల బలాన్ని ఇస్తుంటుంది. తద్వారా మనసులో అనిర్వచనీయమైన ఆనందం పొందుతుంటాను.

ఊహలు రెక్కలు విదిలించుకున్న విహంగంలా ఎగురుతుంటే... భావుకత రాయంచలా నా హృదయాన్ని ఆక్రమించుకుంటుంది. ఆ మధురక్షణాల్ని జీవితంలో ఎప్పుడూ కోరుకుంటుంటాను. కానీ, అవి కరువైన ప్రతిక్షణం విసిగిపోతుంటాను.

సరిగ్గా ఆ సంధ్యాసమయంలో నీ పరిచయం నాలో కొత్తఊపిరు లూదినట్లయింది. చాటింగ్‌లో నువ్వు ప్రదర్శించే సున్నితమైన పదజాలం నన్ను ఆనందమయుణ్ణి చేస్తుంటుంది. మొదట్లో ఎవరో ఓ అభిమానివన్న భావన ఉన్నా- క్రమేణా నువ్వు చూపించే ఆదరణ నన్ను ఎక్కడికో తీసుకుపోతుంటుంది. మన పరిచయం అయి సంవత్సరం అవుతున్నా- ఇంతవరకూ నువ్వు ఎవరివో తెలీదు, ఎలా ఉంటావో తెలీదు, ఎక్కడ ఉంటావో తెలీదు. కానీ, నీ మాటలు నీ రూపాన్ని నా ముందు సాక్షాత్కరిస్తుంటాయి. నీ వ్యక్తిత్వం నన్ను ఏ సుదూర తీరాలకో తీసుకుపోతుంటుంది. నీ మంచితనం ఎప్పుడూ నన్ను మంత్రముగ్ధుణ్ణి చేస్తుంటుంది.

ఈ సందర్భంగా అపురూపను నేను నిందించడం లేదు. సగటు ఆడదానిలా కాకుండా కొంచెం వ్యక్తిత్వం పాలు ఎక్కువున్న మనిషి. ఆమె ఉద్యోగం తనకు ఆర్థిక వెసులుబాటు కలుగజేస్తుందన్న అభిప్రాయాన్ని కొంతవరకు సమర్థించినా- నా హృదయంలో తలదూర్చి తన మల్లెల మాటలతో నన్ను సేదతీర్చాలని ఎప్పుడూ ఆరాటపడుతుంటాను. కానీ, అదేమి విచిత్రమో నాకు తెలియదు గాని- ఎక్కడో ఉన్న నీ మాటలు గిలిగింతలు పెట్టి నాకు అదే అనుభూతిని కలుగజేస్తున్నాయి.

హనీ... నిన్ను అభిమానిస్తున్నానేమోనని అనుమానంగా ఉంది. నిన్ను ప్రేమించాలంటే ఏమి చేయాలంటావ్?"

... అంతులేని భావావేశంతో మెయిల్స్‌ని శర పరంపరగా సంధిస్తున్న సాత్విక్- ఇక్కడికొచ్చేసరికి ఆగిపోయాడు.

మనసు ఊగిలాడుతోంది. తను తప్పు చేస్తున్నాడేమో..?! హరిణి తనని ద్వేషించి దూరమైపోతే..?! ఒక వివాహితుడు స్నేహహస్తాన్ని అందించిన అమ్మాయితో ప్రవర్తించే విధానం ఇదేనా? ఆమె తనని తప్పుగా అర్థంచేసుకుని ఆగ్రహిస్తే... అప్పుడు తన మానసిక స్థితి ఏమిటి?

ఆమె 'నెట్ ఫ్రెండ్‌షిప్' తనకి ఎంతో మధురంగా ఉంది. హరిణిని దూరంచేసుకుని ఆ స్నేహఫలాన్ని త్రుంచి వేయగలడా..? ఏమో..?! హరిణికి దగ్గరవ్వాలని తన మనసు వాంఛిస్తోంది. క్రమంగా విచక్షణ గురించి ఆలోచించలేని ఉన్మాదస్థితికి చేరుకుంటున్నాడు.

అయినా సరే... హరిణి తనముందు కూర్చుని కళ్ళల్లో కళ్ళు పెట్టి, గుండెలో గుండె పెట్టి ఊసులాడితే..?!

ఊగిసలాటల మధ్య తన చేయి తనకు తెలియకుండానే మానిటర్‌లోని 'సెండ్' ఆప్షన్‌ని క్లిక్ చేసింది.

"సాతూ... నీ మెయిల్ చూసి మొదట అవాక్కయ్యాను. ఒక అమ్మాయి అబ్బాయితో స్నేహం చేస్తే చివరికి ముగింపు ఇదేనా? నేను ఎవరో తెలియనంత దూరంలో ఉంటేనే ఇలా అనుచితంగా ప్రవర్తిస్తే- ఇక నీ కంటిముందు ఉంటే..? తలచుకుంటే వెన్నులో వణుకు పుడుతోంది. ఇది నా వ్యక్తిగత వైఖరి అయినా మొదట్లో 'ఏదోలే... టైంపాస్‌కి నెట్ ఫ్రెండ్‌షిప్' అనుకున్నా. నేను మీ రచనావ్యాసంగానికి ఆకర్షింపబడిన విషయం నిజం! సమస్యను విమర్శనాత్మకంగా విశ్లేషించే మీ వైఖరి నన్ను ఎంతగానో ఆకర్షించింది. పాత్రల ఔచిత్యాన్ని కాపాడుతూ, ఎక్కడా పట్టు సడలకుండా సృష్టించిన మీ రచనలన్నీ నా దృష్టిలో సజీవ శిల్పాలు. అందుకే మనస్ఫూర్తిగా మిమ్మల్ని అభిమానించగలిగాను. నా మాటలు మిమ్మల్ని ఎక్కడికో తీసుకుపోతున్నాయంటే ఆనందంతో ఎంతో అనుభూతిని పొందగలుగుతున్నాను.

ఇప్పుడు నాలో ఏదో తెలియని మార్పు! ఇదివరకు రోజుకొక్కసారి మెయిల్ చూసుకునే నేను- ఇప్పుడు నాలుగైదుసార్లు చెక్ చేసుకుంటున్నాను. అదీ సాత్విక్ కోసం! అర్థంకాని వింత వైఖరితో మిమ్మల్ని 'నువ్వు... మీరు...' అంటూ తడబాటుగా సంబోధిస్తున్నాను. మీరన్న మాటలతో అనుసంధానం చేస్తే నాకూ అలాగే అనిపిస్తోంది.

నేనూ... నిన్ను అభిమానిస్తున్నానని అనుమానంగా ఉంది. మీ మాటలు, మీ ఉద్దేశాలు, చిరుజల్లులా తాకి సేదదీర్చే ఆ 'సెన్స్ ఆఫ్ హ్యూమర్' నాలోని విచక్షణను హరింపజేస్తోంది. 'మీరు ఒకరికి భర్త' అనే భావన నాలోంచి కనుమరుగవుతోంది. 'ఈ బంధం అక్రమం' అని మనసు ఘోషిస్తున్నా- తనువు గతి తప్పుతోంది. మీరు గతంలో అన్నట్లు 'మది(వి)' లో విరిసిన పారిజాత మవ్వాలని ఉబలాటంగా ఉంది. అన్నట్లు... మరిచాను- మా ఫ్రెండ్ మారేజ్‌కి నెక్స్ట్ వీక్ మీ ఊరు (హైద్రాబాద్) వస్తున్నాను. కానీ, నిన్ను కలవాలనుకోవడం లేదు. కారణం... ఇంతకాలం మనం ఒకర్ని ఒకరు చూసుకోలేదు. మనకి ఒకరి గురించి ఒకరికి చాలా ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఒకవేళ ఎదురుపడినప్పుడు నిరాశకు లోనై ఆ అనుభూతులు నిర్వీర్యమయితే వేదనకు గురికావాల్సివస్తుంది. కనుక, ఆ బంగారు కల చెదిరిపోకుండా సజీవంగా ఉండాలని నా కోరిక!"

హరిణి హైదరబాద్ వస్తోందంటే చాలా ఆనందంగా ఉంది సాత్విక్‌కి.

'ఇంతవరకు అంబరవీధిలో కొలువుదీరిన ఊహాసుందరి తనను కరుణించటానికి వస్తోంది. ఆమెకు ఎదురువెళ్ళి సాదరంగా స్వాగతం పలికి, పలుకుల పన్నీరుతో పునీతురాల్ని చెయ్యాలి. ఎలా..? ఆమె తనకు కనబడనంటోంది..!'

– ఆలోచిస్తూ... ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా తేలిగ్గా నిట్టూర్చాడు సాత్విక్.

• • •

"హరిణీ మేడమ్! నేను సాత్విక్ ఫ్రెండ్... హరీష్‌ని! వాడు మీ ఈ-మెయిల్ ఎడ్రస్ ఇచ్చి ఈ మెసేజ్ పాసాన్ చేయమన్నాడు. రాత్రి వాడి కారుకి కాచిగూడా వద్ద యాక్సిడెంట్ అయింది. సివియర్ ఫ్రాక్చర్ అవడంతో అపోలో హాస్పిటల్‌లో చేరాడు. బ్లడ్ కూడా బాగా పోయింది.

ఇంకా వివరంగా చెప్పాలంటే- చావుబ్రతుకుల మధ్య ఉన్నాడు. మిమ్మల్ని చివరిసారిగా ఒక్కసారి చూడాలని ఆశపడుతున్నాడు. రూమ్ నెంబరు థర్టీఫైవ్! వెంటనే బయలుదేరి రాగలరు."

కంగారుగా ఆటో దిగి 'అపోలో హాస్పిటల్... రూమ్ నెంబరు థర్టీఫైవ్' వైపు నడిచివస్తున్న ఆమెను చూసి అవాక్కయిపోయాడు సాత్విక్.

• • •

తన ఇంటిలోని చివరి చీకటిగదిలో... నిరాశతో, నిర్జీవంగా పడుకుని ఉన్నాడు సాత్విక్. మనసులోని వేదనలా ఆ గదిలోని వస్తువులు కూడా చిందరవందరగా పడివున్నాయి.

అప్రయత్నంగా సామాన్లు సర్దుతున్న అపురూప చేతులు పట్టుకుని, "అప్పూ! నన్ను మన్నిస్తావు కదూ... 'యాక్సిడెంట్' అని తప్పుడు మెసేజ్ ఇచ్చినందుకు!"

ఒక్కసారి ఆమె కనుకొలనులలో కన్నీరు మెరుపులా మెరిసి మాయమైంది.

చిన్నగా నవ్వుతూ- "ఊహాసుందరిని సృష్టించి, హరిణి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి ఇంతకాలం మిమ్మల్ని తప్పుదారి పట్టించిన నన్ను- మీరే మన్నించాలి!" అంది.

"హరిణి పేరు మీద నువ్వే ఇంతకాలం మెయిల్స్ చేశావని ఊహించలేదు సుమా! ఒక్కటి మాత్రం నిజం... మూగబోయిన నాలోని భావజగతికి జీవంపోసి, నిద్రాణమైన సృజనాత్మకతను వెలికితీశావు."

"అవును... భర్త మనసును గ్రహించలేక పొరపాటు చేశాను. మౌనం రాజ్యమేలుతున్న మన జీవనసంధ్యలో మూగవోయిన మానస వీణను పలికించి, నిర్వీర్యమైన అనురాగ బంధాన్ని రాగసౌధంలో పునఃప్రతిష్ఠ చేయడంకోసం 'హరిణి'గా నెట్‌ఫ్రెండ్ అవతారమెత్తక తప్పలేదు. మీలో నాపట్ల ఆకర్షణ సజీవం. మీ నిస్వార్థతకు నీరాజనాలు..."

"అప్పూ! ఒక పరాయిమనిషి పట్ల నా ప్రవర్తన నీకు బాధ కలిగించలేదా?"

"అజ్ఞాతమైన పిలుపుతో నేను మిమ్మల్ని అలరిస్తే- ఎప్పుడూ కట్టుకున్న భార్యను డౌన్ చేసి మాట్లాడని మీ సంస్కారానికి జోహర్లు! ఆడదైనా, మగాడైనా అవకాశం లేక మంచివాళ్ళుగా మిగులుతారేగానీ, లేకపోతే మనిషిలోని అంతర్గతమైన బలహీనతలు నీలిమేఘాల్లా అల్లుకుపోతూనే ఉంటాయి. పురుషుడుకానీ, స్త్రీ కానీ దీనికి అతీతులు కారేమో! కానీ, 'మగాడు ఈ విషయంలో అందెవేసిన చెయ్యి' అని చెప్పక తప్పదు. ఏదిఏమైనా... అజ్ఞాతమైన అనుబంధాన్ని ప్రదర్శించి మిమ్మల్ని అలరించి, హృదయాన్ని సేదతీర్చినందుకు నేను చాలా ఆనందపడుతున్నాను. ఇది నాలో మార్పుకు నాంది. ఆ ఆనందాన్ని మీనుండి జీవితాంతం కోరుకుంటున్నాను."

సాత్విక్ మనసు ఘనీభవించడంతో భార్య రూపం కళ్ళముందు మసకబారిపోతోంది.

"మీరు ఏమీ తప్పు చేయలేదని తెలుసు. భార్యాభర్తలు మానసికంగా బంధాన్ని దృఢపర్చుకోవాలి. నాకు నా బాధ్యతల కన్నా మీతో ఆనందమయ జీవితం ముఖ్యం! అది నేను కోల్పోవాలని అనుకోవడం లేదు. ఇట్స్ టూ ఇంపార్టెంట్ ఫర్ మీ ఆల్సో! ఎటాచ్చీ... ఈ సత్యాన్ని కొంచెం ఆలస్యంగా గ్రహించానంతే..!"

"అప్పూ... రియల్లీ యు ఆర్ గ్రేట్..!" పిచ్చి ఆవేదనతో మంచంపై తన ప్రక్కగా కూర్చున్న ఆమె ఒడిలో వాలిపోయాడు.